
సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం। 6 । జనవరి। 2025



గుండెపోటు.. కలవరపాటు

మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లతో చిన్న వయసులోనే గుండెపోటు బారిన పడుతున్నారు. ఇటీవల గుండెపోటు కేసులు పెరిగాయి.

8లో



ఫిలిప్పీన్స్ పందెం కోళ్లు

సంక్రాంతి బరిలో దిగడానికి ఫిలిప్పీన్స్ సంకర జాతి పుంజులు కొక్కొరొకో అంటున్నాయి. పందెంగాళ్లు వీటిపై ఆసక్తి చూపుతున్నారు.

8లో



కరెంటు బిల్లులు మంటల్లో వేయాలి

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా కరెంటు బిల్లులను భోగి మంటల్లో వేయాలని సీపీఎం నేతలు పిలుపునిచ్చారు.

8లో

ఆరోగ్యశ్రీ సేవలు బంద్!

సర్కారు అలసత్వం

- నేటినుంచి సేవలు నిలిపివేయనున్న నెట్‌వర్క్ ఆస్పత్రులు
- ఉమ్మడి జిల్లాలో 65 ఆస్పత్రులకు రూ.కోట్లలో బకాయిలు
- సర్వత్రా ఆందోళన
- గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీకి పెద్దపీట

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఎన్‌టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) సేవలు నిలిచిపోయే ప్రమాదం పొంచి ఉంది. పేదల ఆరోగ్య పరిరక్షణలో ప్రధాన భూమిక పోషించే ఆరోగ్యశ్రీ సేవలపై చంద్రబాబు సర్కారు నిండా అలసత్వం చూపుతోంది. ప్రభుత్వం నుంచి భారీగా బకాయిలు ఉండటంతో ఆరోగ్యశ్రీ సేవలను సోమవారం నుంచి నిలిపివేస్తామని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల సమాఖ్య ప్రకటించడంపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది.



ఆరోగ్యశ్రీ హెల్ప్ సెంటర్ (ఫైల్)



ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు పొందుతున్న రోగులు (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేయాలనే విషయంపై జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు చర్చించుకుంటున్నాయి. సోమవారం ఆరోగ్యశ్రీ ఓపీ కచ్చితంగా నిలిపివేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేయాలని చూస్తున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు కలిగిన ప్రైవేట్ ఆస్పత్రులు 34, ఏలూరు జిల్లాలో 31 ఉండగా కూటమి ప్రభుత్వ పాలనలో వీటికి బిల్లులు చెల్లించలేదు. ఆరు నెలలుగా ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే సుమారు రూ.80 కోట్ల బిల్లుల బకాయిలు ఉన్నాయి. సగటున ఒక్కో ఆస్పత్రికి రూ.70 లక్షల నుంచి రూ.1.50 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సేవలను నిలిపివేయడం తప్ప మరో మార్గం లేదని ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి.

రోగుల పరిస్థితి ఏంటి?

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తే పేద, మధ్యతరగతి వర్గాల పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవని, కనీసం ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం కూడా అందకపోతే ఎలా అని ఆవేదన చెందుతున్నారు. దీంతో పాటు ఇప్పటికే ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చేరిన ఇన్‌పేషెంట్లకు సేవలు అందుతాయా, లేదా అన్నదానిపై కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.

దూరాభారం.. ప్రాణసంకటం

పశ్చిమగోదావరి జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు నిలిచిపోతే ఉచితంగా ఉన్నత వైద్యం పొందేందుకు 70 నుంచి 150 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుంది. రాజమండ్రి, కాకినాడ, విజయవాడ, గుంటూరులోని ప్రభుత్వాస్పత్రులకు వెళ్లాలంటూ వ్యయప్రయాసలతో కూడుకుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే అత్యవసర వైద్యం అవసరమైతే రూ.లక్షల్లో వెచ్చించాల్సిందేనని పేద, మధ్యతరగతి వర్గాలు ఆవేదన చెందుతున్నాయి.

గత ప్రభుత్వంలో ఆరోగ్య'మస్తు'

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీకి పెద్దపీట వేశారు. 3,257 వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు నెట్‌వర్క్ ఆస్పత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించారు. దీంతో నిర్విరామంగా సేవలు అందాయి. ఆరోగ్యశ్రీ కింద జిల్లాలో 3 లక్షల మందికి సుమారు రూ.600 కోట్లు, ఆరోగ్య ఆసరా కింద రూ.60 కోట్లు వెచ్చించారు.

ఆస్పత్రుల వివరాలు	పశ్చిమగోదావరి	ఏలూరు జిల్లా
ఎన్టీఆర్ వైద్య సేవ ఆస్పత్రులు	34	31
జిల్లా ఆస్పత్రి	1	1
ప్రభుత్వ ఆస్పత్రులు	61	66

సక్రమంగా అమలుచేయాలి

ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రభుత్వం సక్రమంగా అమలు చేయాలి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలు నిలిచిపోతే పేదలు ఎక్కడకు వెళతారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్టులు, వైద్య సౌకర్యాల కొరత ఉంది. పేదల ప్రాణాలతో చెలగాటం వద్దు. ఆరోగ్యశ్రీ సేవలు బంద్ కాకుండా చూడాలి. – వీరవల్లి శ్రీనివాస్, తోకలపూడి

చాలా ఆందోళనగా ఉంది

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ఉందనే భరోసాతో ఉన్నాం. ఏదైనా అనారోగ్యం వస్తే వెళ్లి చూపించుకుంటున్నాం. అలాంటి ఉచిత సేవలు నిలిపివేస్తారంటే ఆందోళనగా ఉంది. ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగేలా చూడాలి. జగన్ ప్రభుత్వంలో ఇంటింటికీ వచ్చి వైద్య సేవలందించడంతో పాటు నిర్విరామంగా ఆరోగ్యశ్రీ సేవలు అందాయి. -బి.కమలావతి, కొండేపూడి

న్యూస్‌రీల్

గన్నవరం ఎమ్మెల్యేపై టీడీపీ నేతల ఆగ్రహం



నూజివీడులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత పొట్లూరి

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ జరుగుతోందంటూ విమర్శలు చేసిన టీడీపీ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై తెలుగు తమ్ముళ్లు మండిపడ్డారు. గాలి వార్తలను ప్రచారం చే యొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. యార్లగడ్డ ఈనెల 4న విలేకరుల సమావేశంలో నూజివీడు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ జరుగుతోందంటూ మాట్లాడారు. దీనిపై టీడీపీ నూజివీడు నియోజకవర్గ సీనియర్ నాయకులు పొట్లూరి సత్యనారాయణ, గద్దె రఘు, పొట్లూరి శాంతకుమార్ తదితరులు ఆదివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమ మైనింగ్ జరుగుతుంటే ఏనాడైనా మా మంత్రికి చెప్పారా, చెప్తే పట్టించుకోలేదా అని ప్రశ్నించారు. యార్లగడ్డ ఇలా మాట్లాడటం నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలందరినీ అవమానించడమే అన్నారు. నూజివీడును ఎందుకు టార్గెట్ చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. గత నెలలో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ సభలో మంత్రి పార్థసారథి పాల్గొంటే దానిని కూడా సమస్యాత్మకంగా మార్చారన్నారు. ఇలాంటి కుటిల రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. నాయకులు గోగినేని మధు, తుమ్మల ఆది తదితరులు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మా నమోనమః



బుట్టాయగూడెం: కాపవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంతో పాటు తెలంగాణ నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. అలాగే మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువైన పాటమ్మ తల్లి, పసుపులమ్మ తల్లిని కూడా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

భవన నిర్మాణ కార్మికులను దగా చేస్తున్న కూటమి



సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ కార్మికులను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దగా చేస్తోందని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు విమర్శించారు. స్థానిక ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఏలూరు హేలాపురి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకట్రావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో బోర్డుని పునరుద్ధరిస్తాం, భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేస్తాం అన్నారని, గద్దెనెక్కి ఆరు నెలలు పూర్తయినా వీటి ఊసెత్తడం లేదన్నారు. ఊకదంపుడు మాటలు చెప్పిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఏం చేస్తున్నారని నిలదీశారు. త్వరలో ఏలూరు కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా డిప్యూటీ సీఎం భవన నిర్మాణ కార్మికుల తరఫున నిలబడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ సహాయకుల జిల్లా సంఘం ఎన్నిక

ఏలూరు రూరల్: గ్రామ వ్యవసాయ సహాయకుల సంక్షేమ సంఘం మరింత బలోపేతం కావాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొర్లపాటి కుమార్ అన్నారు. ఆదివారం ఏలూరులో జరిగిన జిల్లా వ్యవసాయ సహాయకులు సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడిగా బొడ్డేపల్లి వినోద్‌కుమార్, జనరల్ సెక్రటరీగా గుడిదల బాలార్జున్, ట్రెజరర్‌గా తాడిగడప స్వర్ణలత, ఉపాధ్యక్షుడిగా పంజా కాశీప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మెంతుల రవిచంద్ర, టి.రేష్మతో పాటు జాయింట్ సెక్రటరీలుగా కేజే శ్రీనివాసరావు, వి.రాజు, జి.పవన్, డి.రాకేష్, సభ్యులుగా కె.శివనాగరాజు, టి.అజయ్ కుమార్, బి.రాణి, కె.కోటేశ్వరరావు, బి.అవినాష్, కె.వర్మను ఎన్నుకున్నట్టు చెప్పారు.

ఆలయాలను సందర్శించిన రాష్ట్ర డీజీపీ



డీజీపీకి మావుళ్లమ్మవారి చిత్రపటం అందిస్తున్న అర్చకులు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరంలోని మావుళ్లమ్మ, పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయాలను రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయ అధికారులు ఆయనకు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. డీజీపీ ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. మావుళ్లమ్మ ఆలయంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, పంచారామ క్షేత్రంలో ఈఓ డి.కృష్ణంరాజు ఆయనకు దేవతామూర్తుల చిత్రపటాలు అందజేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, అడిషనల్ ఎస్పీ భీమారావు తదితరులు డీజీపీ వెంట ఉన్నారు.

టీచర్ల జీతాల చెల్లింపులో వివక్ష తగదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జనవరి నెల ఆరంభమై ఐదు రోజులు గడిచినా ఉపాధ్యాయులకు జీతాలు జమచేయకపోవడం దారుణమని ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ ఏలూరు జోన్ సమావేశాన్ని జోనల్ కార్యదర్శి కె.కొండయ్య అధ్యక్షతన ఆదివారం తంగెళ్లమూడిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాల మంజూరులో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వెంటనే ఐఆర్ ప్రకటించి సకాలంలో జీతాలు, లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు డీకేఎస్ఎస్ ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

హరిదాసుడిపై టీడీపీ నేత జులుం

- గ్రామంలో తిరగాలంటే రూ.2.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- కైకరంలో రచ్చకెక్కిన వివాదం



కైకరంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న హరిదాసులు

ఉంగుటూరు: కూటమి నాయకుల దందాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. చివరకు సంక్రాంతి నెలలో ఇంటింటా తిరిగి దానాలు తీసుకునే హరిదాసులను కూడా వీరు వదలడం లేదు. మండలంలోని కై కరం గ్రామంలో ఓ హరిదాసుడిని టీడీపీ నేత ముప్పుతిప్పలు పెడుతున్న వైనం వివాదానికి దారితీసింది. వివరాలిలా ఉన్నాయి.. ఏటా మాదిరిగా హరిదాసు రమేష్ గ్రామంలో సంచరిస్తూ దానాలు తీసుకుంటున్నారు. అయితే గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత రమేష్‌ను గ్రామంలో తిరగడానికి వీలులేదని, దానాలు తీసుకోవాలంటే రూ.2.50 లక్షలు ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేశాడు. ఇందుకు ససేమిరా అనడంతో దుర్భాషలాడుతూ, దౌర్జన్యం చేయడంతో పాటు తన ద్విచక్రవాహనం తాళం చెవి తీసుకుని టీడీపీ నేత ఇబ్బంది పెట్టాడని రమేష్ వాపోయారు. రమేష్ నాలుగేళ్ల నుంచి సంక్రాంతి నెలలో గ్రామంలో తిరుగుతున్నారు. అయితే నాలుగేళ్లకు ముందు మరో హరిదాసు ఇక్కడ తిరిగేవారు, ఆయన ఇప్పుడు మరలా వచ్చి గ్రామంలో తిరుగుతానని అనడం వివాదస్పదమైంది. దీంతో వీరి పంచాయితీ గ్రామపెద్ద టీడీపీ నేతకు వెళ్లడంతో ఒక ఏడాది ఒకరు, మరో ఏడాది మరొకరు తిరగమని ఆదేశించారు. ఇందుకు బాధితుడు రమేష్ అంగీకరించకపోవడంతో రూ.2.50 లక్షలు ఇవ్వాలని టీడీపీ నేత డిమాండ్ చేసినట్టు సమాచారం. ఈ క్రమంలో రమేష్‌ను ఇబ్బంది పెడుతున్నట్టు హరిదాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్‌ని వివరణ కోరగా అలాంటిది ఏమీ లేదని, ఇరువర్గాలను తగువు లేకుండా సరిచేశారని, హరిదాసుల పెద్దలు కూడా ఉన్నారని అన్నారు.

13 నుంచి సంక్రాంతి సంబరాలు

- చినవెంకన్న క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు
- 14న నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు
- 15న కనుమ ఉత్సవం



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న దివ్య క్షేత్రంలో ఈనెల 13 నుంచి 15 వరకు సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేండ్ర త్రినాథరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భోగి పండుగను పురస్కరించుకుని 13న ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని ఖాళీ ప్రదేశంలో కోలాట నృత్యాలు, హరిదాసులు, బుడబుక్కల వేషధారణలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 14న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే 15న కనుమ పండుగ సందర్భంగా దొరసానిపాడు గ్రామంలో శ్రీవారికి కనుమ ఉత్సవాన్ని అట్టహాసంగా నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారు ఆలయం నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ దొరసానిపాడుకు బయలుదేరి వెళతారని, అక్కడ కనుమ మండపంలో అర్చకులు, పండితులు వేద మంత్రోచ్చరణలతో ఉత్సవాన్ని వైభవంగా జరుపుతారని తెలిపారు. ఆ తర్వాత శ్రీవారు గిరి ప్రదక్షిణగా ఆలయానికి చేరుకుంటారని చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు వేడుకల్లో పాల్గొని తరించాలని ఈఓ త్రినాథరావు కోరారు.

11న డీటీఎఫ్ ధర్నా



వివరాలు వెల్లడిస్తున్న డీటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర అధ్యకుడు కె.నరహరి తెలిపారు. ఆదివారం ఏలూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీఓ 117ను పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు విఫల ప్రయోగమన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఆవాస ప్రాంతంలోని పాఠశాలలన్నింటినీ కలపడం సరికాదన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగించాలని, వాటిని స్కూల్ అసిస్టెంట్లతోనే నడపాలని, ప్లస్ టూ కళాశాలలు కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులకు పాత పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలని, నూతన పీఆర్సీతో పాటు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏలో పీఈటీ పోస్టులు అప్ గ్రేడ్ చేయాలని, గిరిజన ప్రాంతాల్లో రద్దయిన జీఓ నం.3లోని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి కె.సురేష్‌కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.త్రినాథరావు, జిల్లా అధ్యక్షుడు కె.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



టెలిగ్రామ్ ఆఫీసు రోడ్డులో ఇలా..



ఎస్‌బీఐ బజారు బ్రాంచ్ వద్ద..

కంకర పరిచారు.. తారు మరిచారు



ఏలూరులోని శ్రీ కృష్ణదేవరాయ స్కూల్ రోడ్డులో ..

ఏలూరు నగరంలో 'గుంతలు లేని రహదారులు' పేరిట చేపట్టిన పనుల్లో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది. పాడైపోయిన రోడ్డు గుంతల్లో కంకర వేసి.. తారు వేయకుండా వదిలేశారు. దీంతో కంకర రోడ్డు మీద వాహనాలు అదుపు తప్పి ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. సంక్రాంతిలోపు గుంతలు లేని రహదారులు ఉండాలనే ఆదేశాలతో స్థానిక నాయకులు హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. అయితే పనులు ఇలా అసంపూర్తిగా వదిలేయడంపై ప్రజల్లో నిరసన వ్యక్తమవుతోంది. ఏలూరులోని పలు ప్రాంతాల్లో గుంతలను కంకరతో పూడ్చి వదిలేసిన దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



బిర్లాభవన్ సెంటర్‌లో..

క్లుప్తంగా

చోరీకి యత్నం



జంగారెడ్డిగూడెం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో చోరీకి ప్రయత్నిస్తున్న దుండగుడు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ హుండీ చోరీకి దుండగుడు యత్నించాడు. శనివారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తి హుండీ తెరిచేందుకు ప్రయత్నించాడు. ఎంతసేపటికీ హుండీ తెరుచుకోకపోవడంతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. దుండగుడు చేసిన ప్రయత్నం ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డయ్యింది.

బెదిరింపు కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పంటను ధ్వంసం చేసి చంపుతానని బెదిరిస్తున్నారని కొయ్యలగూడెం మండలం యర్రంపేటకు చెందిన చెరుకూరి సాయిరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. సాయిరత్నానికి జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం రెవెన్యూ పరిధిలో 3.24 ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో పొగాకు వేశారు. తన పొలానికి సరిహద్దు రాళ్లు కూడా పాతించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 3న రాత్రి సమయంలో కొయ్యలగూడెం మండలం రాజవరం గ్రామానికి చెందిన బిరుదుగడ్డ కృష్ణమూర్తి పొలంలోకి అక్రమంగా ప్రవేశించి సర్వే రాళ్లు పీకివేసి అరెకరం పొలంలోని పంటను, డ్రిప్‌లైన్‌ను ధ్వంసం చేశాడని సాయిరత్నం తెలిపింది. ఈ ఘటనలో తనకు రూ.1.10 లక్షల నష్టం వచ్చిందని, దీనిపై కృష్ణమూర్తిని అడగగా చంపుతానని బెదిరించినట్లు సాయిరత్నం ఫిర్యాదులో పేర్కొందన్నారు.

సారా బట్టీలపై మెరుపు దాడులు



చిల్లబోయినపల్లిలో సారాబట్టీపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ముసునూరు: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా తయారు చేసి, విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ భోగేశ్వరరావు ఆధ్వర్యంలో సారా బట్టీలపై మెరుపు దాడులు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏ.మస్తానయ్య తెలిపారు. ముసునూరు మండలంలోని చిల్లబోయినపల్లిలో రహస్యంగా నాటుసారా తయారు చేస్తున్న అనగాని చంద్రరావు, వెంకటేశ్వరరావుకు చెందిన నాటుసారా బట్టీపై ఆదివారం ముప్పేట దాడి చేశారు. దాడిలో సారా తయారీ కోసం ఊరబెట్టిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. బట్టీ యజమానులు సంఘటనా స్థలం నుంచి పారిపోగా, వారిపై కేసులు నమోదు చేశామన్నారు.

గుండెపోటు.. కలవరపాటు

- జీవనశైలిలో మార్పులతో ముప్పు
- ఆహార నియమాలు, వ్యాయామాలపై నిర్లక్ష్యం
- గ్రామాల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏటా 6,500 కేసుల నమోదు



బుట్టాయగూడెం : మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లతో చిన్న వయసులోనే గుండెపోటు బారిన పడుతున్నారు. ఇటీవల కాలంలో గుండె పోటు కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 50 ఏళ్ల లోపు వారు గుండెపోటుతో ఆస్పత్రుల్లో చేరడం, ఆకస్మిక మరణాల తీరు భయపెడుతున్నాయి. ఒక వైపు ప్రైవేటు ఆస్పత్రులు, మరోవైపు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వందలాది మంది గుండె సంబంధింత జబ్బులతో చికిత్స కోసం క్యూ కడుతున్నారు. తగినంత వ్యాయామం లేకపోవడం, జంక్ ఫుడ్ అలవాట్లు, ఒత్తిళ్లు పెరగడం, ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి ప్రధాన కారణాలతో వస్తున్న గుండె పోటులు కుటుంబాలను విషాదంలోకి నెడుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా గుండె జబ్బులు చుట్టుముడుతున్నాయి. కోవిడ్ వ్యాప్తి తర్వాత జిల్లాలో అధికంగా గుండె పోటు కేసులు నమోదువుతున్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఉమ్మడి పశ్చిమలో ఏటా 6,500 కేసులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిలాలో ఏటా సుమారు 6,500 గుండెపోటు కేసులు నమోదువుతున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. 2024 జూన్ నుంచి నేటి వరకూ 6 నెలల వ్యవధిలో ఏలూరు జిల్లాలోనే 600 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. వీరిలో అధికంగా గ్రామీణ ప్రాంత నిరుపేదలు ఎక్కువగా ఉండడం ఆందోళనకు గురి చేస్తుంది. ముఖ్యంగా యువతలో హృద్రోగ ముప్పు ఎక్కువగా ఉంటుందని వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గుండె వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

గుండెపోటుకు ప్రధాన కారణాలు

- రక్తపోటు నియంత్రణలో లేకపోవడం...
- ఎక్కువ నూనెలు, కొవ్వులతో కూడిన ఆహారం తీసుకోవడం
- కొవ్వు పేరుకుపోయి గుండెకు వెళ్లే రక్తనాళాలను పూడుకుపోవడం..
- ఒబెసిటీ.. వయసు, ఎత్తుకు తగ్గినట్లు బరువు ఉండకపోవడం
- తీవ్ర మానసిక ఒత్తిడి
- ఆరోగ్య పరీక్షలపై అవగాహన లేకపోవడం

గుండెపోటు లక్షణాలను గుర్తించడం ఇలా

- ఛాతి మధ్య భాగంలో నొప్పి
- ఛాతి నుంచి ఎడమ, కుడి చేతి, గొంతు వైపు నొప్పి వ్యాపించడం
- చెమటలు పట్టడం, ఆయాసం
- ఛాతి పట్టేసినట్టుగా, బరువుగా ఉండడం
- ఎసిడిటీని పోలిన లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి

జాగ్రత్తలు ఇలా..

- రోజూ క్రమం తప్పకుండా 45 నిమిషాలు వ్యాయామం చేయాలి.
- 35 ఏళ్లు వచ్చాక మధుమేహం, బీపీ వంటి పరీక్షలు తరచూ చేయించుకోవాలి.
- 6 నెలలకు ఒకసారి తప్పని సరిగా ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలి.
- ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారం తీసుకోవాలి.
- సుగర్, బీపీ ఉన్న వారు మందులతో అదుపులోకి తెచ్చుకోవాలి.
- శరీరంలో కొవ్వు, నూనె మోతాదుకు మించి ఉంటే అదుపులో ఉంచుకోవాలి.

వ్యాయామం చేయకపోతే ప్రమాదం



యువకుల్లో పూర్తిగా నడక తగ్గిపోయింది. కిలోమీటరు వెళ్లాలన్నా వాహనాలపై వెళ్తున్నారు. ఇష్టానుసారంగా కొవ్వుతో కూడిన ఆహారం తినడం, వ్యాయామం చేయకపోవడం వల్ల 30 ఏళ్లకే హార్ట్ స్ట్రోక్ వస్తోంది. శరీరానికి వ్యాయామం అత్యంత అవసరం.

డాక్టర్ కొల్లురు లక్ష్మణ్, గుండె వైద్య నిపుణుడు, రాజమండ్రి

ఏడాదికి 6,500 కేసుల నమోదు



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో ఏడాదికి 6,500 గుండెపోటు కేసులు నమోదవుతున్నాయి. 2024 జూన్ నుంచి 2025 జనవరి 4 నాటికి ఏలూరు జిల్లాలో సుమారు 600 గుండె పోటు కేసులు నమోదయ్యాయి. గుండెపోటు పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

డాక్టర్ ఐ.రాజీవ్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్, ఏలూరు

మురుగు డ్రెయిన్‌లోకి పల్టీకొట్టిన కారు



అత్తిలి మండలం బల్లిపాడు ప్రాంతంలో మురుగు డ్రెయిన్‌లోకి పల్టీకొట్టిన కారు

అత్తిలి: కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మురుగు డ్రెయిన్‌లోకి పల్టీకొట్టిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆదివారం సాయంత్రం అత్తిలి మండలం తిరుపతిపురం నుంచి ఐదుగురు యువకులు అత్తిలి వైపు వస్తుండగా మలుపు వద్ద అదుపుతప్పి కొబ్బరి చెట్టును ఢీకొట్టి డ్రెయిన్‌లోకి దూసుకెళ్లింది. స్థానికులు వెంటనే స్పందించి కారు అద్దాలు బద్దలుకొట్టి కారులో చిక్కుకున్న యువకులను బయటకు తీశారు. స్వల్ప గాయాలవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఫిబ్రవరి 7న సూర్య దేవాలయం ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి వెంకటేశ్వర నగర్‌లో నూతనంగా నిర్మించిన సూర్య దేవాలయంను ఫిబ్రవరి 7వ తేదీన ప్రారంభించినున్నట్లు ఆలయ నిర్మాత, ఆదిదేవ ట్రస్ట్ వ్యవస్థాపకులు పుల్లాబొట్ల సూర్యనారాయణమూర్తి వెల్లడించారు. ఆ రోజు ఉదయం 11.24 నిమిషాలకు ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 5, 6 తేదీల్లో హోమాలు, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు సూర్య దేవాలయంను దర్శించాలని కోరారు.

బరిలోకి ఫిలిప్పీన్స్ పందెం కోళ్లు

తగ్గిన పెరూ జాతి కోళ్లు

తాడేపల్లిగూడెం: సంక్రాంతి బరిలో దిగడానికి ఫిలిప్పీన్స్ సంకరం పుంజులు కొక్కొరొకో అంటున్నాయి. కాటా పందేలు, ముసుగు పందేలు, చూపుడు పందేలకు కాలం చెల్లింది. దేశీయ నాటు రకం పుంజులను కాదని ఐదేళ్ల క్రితం పెరూ పుంజులను బరుల్లోకి తెచ్చారు. శరీర దృఢత్వం ఎక్కువగా ఉన్న ఈ పుంజు మన దగ్గరుంటే సొమ్ములే అనుకున్నారు. గత పందేలలో పెరూ కంటే దేశీయ జాతి పుంజులు భళా అనిపించాయి. బరుల్లో కాలు దువ్విన పెరూ పుంజులు కోజాలుగా మారిపోయాయి. ఈ క్రమంలో ఔత్సాహికులైన పందెంగాళ్లు ప్రత్యామ్నాయాల కోసం వెదుకుతున్న క్రమంలో ఫిలిప్పీన్స్ సంకరం ఆశాకిరణంగా కనిపించింది. ఈ ఏడాది సంక్రాంతి పందేలలో ఫిలిప్పీన్స్ సంకర పుంజులను బరిలో దింపేందుకు దాచి ఉంచారు. ఫిలిప్పీన్స్ పుంజులు చూడడానికి నాసిగా.. నాజూకుగా కనిపిస్తాయి. ఎముక పటుత్వం ఎక్కువ. శారీరక దృఢత్వం కూడా అధికం కావడంతో బరిలో అలసిపోవు. జిల్లాలోని పెంపకందార్లు ఫిలిప్పీన్స్ నుంచి ఈ పుంజులను తీసుకొచ్చి దేశీయ టీకరా పెట్టలతో సంకరం చేశారు. ఈ రెండింటి సంకరమే ఫిలిప్పీన్స్ సంకర జాతి పుంజులు. ఈ సారి పందేలలో ఈ పుంజులే ఎక్కువగా సందడి చేయనున్నాయి. ప్రత్యేక మెనూతో పాటు, ఈ సంకర పుంజులకు ఆకుల ఔషధాల ఆవిరులు పట్టి ఆరోగ్యంగా ఉండేలా చూస్తున్నారు.

ప్రత్యేక మెనూ

చోళ్లు, గంట్లు వంటి సాధారణ మేతతో పాటు ఈ సంకర పుంజులకు గుడ్లు, పోతు మాంసం, పిట్ట మాంసం, నాస్తా లడ్డు, తొమ్మిదిరకాల పప్పులతో తయారు చేసిన పదార్థాలు పెడుతున్నారు.



ఫిలిప్పీన్స్ పుంజు



టీకరా పెట్ట (ఇండియా)





సంకరం వల్ల పుట్టిన పుంజులు

కరెంటు బిల్లులు భోగి మంటల్లో వేయాలి



భీమవరంలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు ఉమామహేశ్వరరావు, సీతారాం తదితరులు

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి అక్రమ మార్గంలో వసూలు చేస్తున్న విద్యుత్ చార్జీలకు నిరసనగా సంక్రాంతి భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం పిలుపునిచ్చారు. భీమవరంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.15 వేల కోట్లు భారం వేసిందన్నారు. ఎన్నికల్లో టీడీపీ నాయకులు ప్రజలకిచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యుత్ వసూళ్లు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలనుంచి అక్రమంగా విద్యుత్ చార్జీల వసూళ్లను నిరసిస్తూ భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన వ్యక్తం చేయాలన్నారు. రాష్ట్రంలో మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని హైందవ మహాసభ పేరుతో మత ఘర్షణలు రెచ్చగొట్టడానికి చీలికలు తేవడానికి ప్రయత్నిస్తే సహించబోమని హెచ్చరించారు. గతంలో అదానీతో కుదుర్చుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బి.బలరామ్, జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ విగోపాలన్, కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, బి వాసుదేవరావు పాల్గొన్నారు.

సీపీఎం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

సీపీఎం జిల్లా నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మూడు రోజులుగా భీమవరం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరుగుతున్న పార్టీ జిల్లా 26వ మహాసభల ముగింపు సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మూడేళ్లపాటు కొనసాగే ఈ కార్యవర్గంలో 25 మందితో నూతన జిల్లా కమిటీని మహాసభలకు హాజరైన 300 మంది ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన కార్యదర్శిగా జెఎన్‌వి గోపాలన్ ఎన్నికయ్యారు.

కొండచిలువ కలకలం



పైడిపర్రులో కొండచిలువను పట్టుకుంటున్న మనీష్

తణుకు అర్బన్: తణుకు మండలం పైడిపర్రులో కొండచిలువ హల్‌చల్ చేసింది. మండపాక రోడ్డులోని ఇంద్ర డిస్టిలరీ ప్రాంతంలో రహదారిపై శనివారం రాత్రి ప్రత్యక్షమైన 6 అడుగుల కొండ చిలువ కలకలం సృష్టించగా గ్రామస్తులు భారీ సంఖ్యలో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. స్థానికులు చాకచక్యంగా కొండచిలువను పట్టుకుని డబ్బాలో బంధించి ఫ్లూటస్ టెక్‌ల్యాబ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ సహకారంతో సురక్షితంగా ఉంచారు. పైడిపర్రు వీఆర్వో మొహిద్దీన్, అగ్నిమాపక కేంద్రం ఇచ్చిన సమాచారంతో ఆదివారం ఉదయం ఫారెస్ట్ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని పాలకొల్లుకు చెందిన నెస్ట్ కన్జర్వేషన్ సొసైటీ ప్రతినిధి మనీష్ ఎంతో నేర్పుతో కొండచిలువను డబ్బా నుంచి బయటకు తీసి సంచిలో బంధించారు. ఫారెస్ట్ అధికారి ఆదేశాల మేరకు కొండచిలువను వెంకట్రామన్నగూడెం ఫారెస్ట్ ఏరియాలో వదిలివేయనున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నరసాపురం కె.రాంప్రసాద్ చెప్పారు.

నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

భీమడోలు: ఇంట్లో టీ కాస్తుండగా ప్రమాదశాత్తు చీరకు నిప్పంటుకోవడంతో తీవ్ర గాయాలతో ఓ వృద్ధురాలు శనివారం రాత్రి మృతి చెందింది. పూళ్ల గ్రామానికి చెందిన వాసురెడ్డి సత్యవతి(85) ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామంలోని జంగం వీధిలో వాసురెడ్డి సత్యవతి ఒంటరిగా ఉంటుంది. ఈ నెల 4న వంట గదిలో కట్టెల పొయ్యిపై టీ కాస్తుండగా ప్రమాదవశాత్తు చీరకొంగుకు మంటలు అంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. కుమార్తె కోలా నాగలక్ష్మీ తీవ్ర గాయాలతో ఉన్న సత్యవతిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి విద్యుత్ చార్జీల టారిఫ్ ప్రతిపాదనలపై ఈనెల 7, 8, 10వ తేదీల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. వార్షిక ఆదాయం అవసరాలు నివేదికపై 7, 8 తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లోను, పదవ తేదీన కర్నూలు ఏపీఈఆర్సీ కార్యాలయంలో ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు నేరుగాను, 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని, వినియోగదారులు అభ్యంతరాలను వెల్లడించవచ్చని చెప్పారు. ఏపీఈఆర్సీ చైర్మన్ ఇన్‌చార్జి ఠాకూర్ రామసింగ్ ఆధ్వర్యంలో ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారని, సమీపంలోని విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయాలు, డివిజన్ కార్యాలయాలలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినియోగదారులు పాల్గొని అభిప్రాయాలు చెప్పవచ్చని వివరించారు.

పక్షులు మెచ్చేలా.. కుచ్చులు



సిద్ధాంతం సమీపంలోని ఓ దుకాణం వద్ద వరికుచ్చులు



పూర్వం పక్షులకు ఆహారంగా కొన్ని వరి కంకులను కుచ్చులుగా, తోరణాలుగా తయారు చేసి ఇంటి సింహద్వారాలకు, వాసాలకు, ఆలయాల వద్ద వేలాడదీసేవారు. ఆత్మీయులకు వాటిని కానుకగా పంపేవారు. అయితే వరికోత యంత్రాల రాకతో చాలావరకు ఈ వరి కుచ్చులు పెట్టేవారు తగ్గిపోయారు. ప్రస్తుతం జిల్లాలోని హైవే వెంబడి షాపుల్లో తోరణాలుగా, జల్లెడగా వివిధ ఆకృతుల్లో కుచ్చులను వాటి ఆకారం మేరకు రూ.100 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. దారి వెంబడి వెళ్లే వారు వీటిని కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు. కొందరు ప్రత్యేకంగా తయారుచేయించి విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లలోని తమ వారికి పంపుతున్నారు.

– సాక్షి, భీమవరం

క్రాస్ కంట్రీ రోడ్ రన్ పోటీల్లో ప్రతిభ



క్రాస్ కంట్రీ రోడ్ రన్ చాంపియన్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

తణుకు అర్బన్: రాష్ట్ర స్థాయి 59వ క్రాస్ కంట్రీ రోడ్ రన్ చాంపియన్‌షిప్ 2025 పోటీలు తణుకు మండలం వేల్పూరు హైస్కూలులో నిర్వహించారు. అండర్ 16, 18, 20 బాలురు, బాలికలు, పురుషులు, స్త్రీల విభాగంలో పోటీలు నిర్వహించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. వివిధ జిల్లాలకు చెందిన 400 మంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో అత్యంత ప్రతిభ చూపిన 32 మందిని విజేతలుగా ప్రకటించినట్లు చెప్పారు. వీరు ఈనెల 12న ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నిర్వహించే జాతీయ స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్స్‌గా విశాఖ జిల్లా క్రీడాకారులు నిలిచినట్లు చెప్పారు. పోటీలను ఆరిమిల్లి తాతారావు, సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి ప్రారంభించారు. విజేతలకు పెనుమర్తి వెంకటలక్ష్మి, రెడ్డి నరేంద్రప్రసాద్, కరుటూరి నరేంద్ర, పి.శిరీష బహుమతులు అందచేశారు.

సబ్ జైలులో సౌకర్యాల పరిశీలన



చింతలపూడి సబ్ జైలులో వివరాలు అడుగుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

చింతలపూడి: ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ సీహెచ్ పురుషోత్తం కుమార్ ఆదివారం చింతలపూడి సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి నిందితుల కేసుల వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యం, అనారోగ్యంగా ఉన్న నిందితుల గురించి ఆరా తీశారు. జైలు ప్రాంగణంలో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే రత్నం ప్రసాద్, చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధు బాబు, పానల్ అడ్వకేట్ ఏసు పాదం తదితరులు ఉన్నారు.

నేడు దంత కళాశాలలో స్నాతకోత్సవం

పెదవేగి : నేడు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల బీడీఎస్ విద్యార్థులకు, ఎండీఎస్ పట్టభద్రులకు 18వ స్నాతకోత్సవాన్ని ఏలూరు పీఠాధిపతి విశాఖపట్నం అగ్ర పీఠాధిపతి పాలనాధికారి, కళాశాల చైర్మన్ మోస్ట్ రెవరెండ్ బిషప్ జయ రావు పొలిమేర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ సెక్రటరీ ఫాదర్ జి.మోజెస్ తెలిపారు. చీఫ్ గెస్ట్‌గా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ వి.రాధికా రెడ్డి, స్పెషల్ ఇన్వైటర్‌గా మైసూర్ ఆర్చ్ బిషప్ రెవరెండ్ డాక్టర్ జార్జ్ అంతోని స్వామి, గెస్ట్ ఆఫ్ హానర్‌గా వికార్ జనరల్ ఫాదర్ పి బాల పాల్గొంటారని తెలిపారు.

ఆశలన్నీ రబీపైనే

- ముమ్మరంగా వరినాట్లు
- రబీ సాగులో నిమగ్నమైన రైతులు

పెంటపాడు: రబీ సాగుకు రైతన్నలు గంపెడాశతో సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో దిగుబడులు గణనీయంగా పడిపోవడంతో రైతులకు లాభాలు దక్కలేదు. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 50 నుంచి 60 బస్తాల వరకు దిగుబడి వస్తుందని, కానీ ఖరీఫ్‌లో ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు మాత్రమే దిగుబడి రావడంతో గిట్టుబాటు కాలేదని రైతన్నలు వాపోయారు. దీంతో ప్రస్తుతం వారంతా రబీ సాగుపైనే ఆశలు పెట్టుకున్నారు. పొలాల్లో నాట్లు జోరుగా సాగుతున్నాయి. కొందరు పొలాల్లో దమ్ములు చేస్తుంటే మరికొందరు నాట్లకు చేలను సిద్ధం చేస్తున్నారు. ఇంకొందరు నాట్ల వేసే పనిలో బీజీగా ఉన్నారు. డివిజన్ వ్యాప్తంగా రబీలో సుమారు 36వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తుండగా పెంటపాడు మండలంలో 24 వేల ఎకరాల్లో సాగు జరుగుతుంది. ఇప్పటివరకు సుమారు 30 శాతం నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పెట్టుబడుల కోసం తిప్పలు

సాధారణంగా రబీలో వరి సాగుకు పెట్టుబడి ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు అవుతుంది. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు రైతు భరోసా సొమ్ము అందజేయకపోవడంతో రైతన్నలు పెట్టుబడి సాయం కోసం అయినకాడికి అప్పులు చేయాల్సిన పరిస్థితి. నీటి ఎద్దడి లేకుండా వాతావరణం అనుకూలించి 50 నుంచి 60 బస్తాల వరకు దిగుబడి వస్తే ఖరీఫ్‌లో వచ్చిన నష్టాలను అధిగమించవచ్చని రైతులు చెబుతున్నారు.

అందుబాటులో ఎరువులు

రబీ పంటకు ఎరువులు సిద్ధంగా ఉన్నాయని తాడేపల్లిగూడెం ఏడీఏ మురళీకృష్ణ చెబుతున్నారు. డివిజన్ వ్యాప్తంగా రబీ పంటకు 3600 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటికే 1200 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధం చేసినట్లు చెప్పారు. సొసైటీలు, మార్క్‌ఫెడ్ ద్వారా వాటిని రైతులకు సరఫరా చేయాల్సి ఉంది. సొసైటీల్లో కూడా ఎరువులు సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.


రబీసాగులో దమ్ము చేస్తున్న ట్రాక్టర్


నాట్లకు పంట చేలు సిద్ధం చేస్తున్న రైతులు

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సత్కారం


తణుకులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకుని తణుకు పాతూరులో బ్యాక్ వర్డ్ మైనారిటీ కమ్యూనిటీ ఫెడరేషన్ (బాంసెఫ్) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లోని మహిళా సంఘ సేవకులు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి పూలే అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇరగవరం ఎంఈఓ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు కూడా విద్యనభ్యసించాలని మొదటి ఉపాధ్యాయురాలిగా మహిళలను తీర్చిదిద్దిన మహనీయురాలు సావిత్రి బాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో విజయశ్రీ, డాక్టర్ చంద్రప్రసాద్, న్యాయవాది పొట్ల సురేష్, బీసీ నాయకురాలు వావిలాల సరలాదేవి, నిరీక్షణరావు, వెన్నపు రవి, గంజి మధు, పి.రాజేష్, పి.బాలు పాల్గొన్నారు.

అత్తిలిలో ధ్యాన శిక్షణ


పిరమిడ్ మాస్టర్ కృష్ణమూర్తి

అత్తిలి: మనిషి ఎదుగుదలకు ఆచరణ ఒక్కటే మార్గమని పిరమిడ్ మాస్టర్ జి.కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం అత్తిలిలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధ్యాన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనుభవ పూర్వకంగా తెలుసుకోవడం ద్వారా ఆత్మజ్ఞాని అవుతారన్నారు. వినయం లేని ధ్యానం వ్యర్థమని అన్నారు. మనిషిలో వ్యక్తిగత మార్పు వచ్చేలా ధ్యానం చేయాలన్నారు. జన్మను సార్థకత చేసుకోవడం కోసం ఇతరులకు తోచిన సహాయం చేయాలన్నారు. కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం ధ్యానం లక్షణమన్నారు. నిశ్చలంగా ధ్యానం చేయడం ద్వారా విశ్వమయ ప్రాణ శక్తిని పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా ధ్యానులు సామూహిక ధ్యానం చేశారు. కార్యక్రమంలో దాసం వెంకట ప్రసాద్, కడలి మాణిక్యాలరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఉచిత వైద్య సేవలు


తణుకులో రోగుల ఇంట్లో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. ప్రతి ఆదివారం ఇంటింటికీఉచిత వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలూ మహేంద్ర, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్యలు తణుకుతో పాటు ఉండ్రాజవరం గ్రామంలో పర్యటించి ఆరుగురు వృద్ధులకు వైద్యసేవలు అందజేశారని అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఇంటికి పరిమితమైన రోగులు ఉచిత వైద్యసేవల కోసం 9985343530 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

70 మందికి ఉచిత గుండె పరీక్షలు


వైద్య శిబిరంలో గుండె పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: చినతాడేపల్లి సచివాలయం వద్ద ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఉషా కార్డియాక్ సెంటర్ వైద్యులు డాక్టర్ వైవీ రావు ఆధ్వర్యంలో 70 మందికి ఉచితంగా గుండె పరీక్షలు చేశారు. 20 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, మాజీ సర్పంచ్ చిటకన శ్రీనివాస్, నాయకులు పరిమి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్పీటీసీ కూనపాముల వెంకట్రావు, రాజేష్, నందమూరి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్: ఓ ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొనడంతో మోటార్‌సైక్లిస్టుకు గాయాలయ్యాయి. రూరల్ ఏఎస్సై పీవీకే.దుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరుకు చెందిన సరికొండ మల్లేష్, అతని బావమరిది పిన్నెపు రాళ్ల విజయ్ మోటారు సైకిల్‌పై తణుకు నుంచి ఏలూరు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో తాడేపల్లిగూడెం ఏపీ నిట్ కళాశాల సమీపానికి వచ్చే సరికి జాతీయ రహదారిపై ఏలూరు నుంచి తణుకు వైపు వస్తున్న ప్రైవేట్ కళాశాల బస్సు హఠాత్తుగా మలుపు తిప్పడంతో మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ నేపథ్యంలో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న మల్లేష్‌కు తీవ్ర గాయాలు కాగా అతడిని ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఆస్పతి నుంచి అందిన సమచారం, పిన్నెపు రాళ్ల విజయ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్సై దుర్గారావు తెలిపారు.

మాలమహానాడు రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నాగేశ్వరరావు


నాగేశ్వరరావుకు నియామక పత్రం ఇస్తున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాల మహానాడు రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల గ్రామానికి చెందిన మానుకొండ నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ మాల మహానాడు బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మానుకొండ నాగేశ్వరరావు తాడేపల్లిగూడెం రూరల్ మండల అధ్యక్షునిగాను, కొవ్వూరు డివిజన్ అధ్యక్షునిగాను, జిల్లా ఉపాధ్యక్షునిగా పనిచేసిన అనుభవం ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును పలువురు అభినందించారు.

సారా, గంజాయి విక్రయాలపై పటిష్ట నిఘా

ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి

తాడేపల్లిగూడెం: నాటుసారా, గంజాయి విక్రయాలపై పటిష్ట నిఘా ఉంచామని ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం పట్టణంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, నిట్ కళాశాల సమీపంలోని ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం నాటుసారా, గంజాయి, లిక్కర్ వలన కలిగే అనర్థాల గురించి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శ్రీలత ఆదేశాల మేరకు గూడెం సర్కిల్ పరిధిలో దాడులు చేశారు. పెంటపాడు మండలం ఉమామహేశ్వరం, ముదునూరు గ్రామాల్లో బెల్టు దుకాణాల నిర్వాహకులను పట్టుకున్నారు. ఈ దాడుల్లో ఇద్దరి నిందితుల వద్ద నుంచి 20 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, గూడెం ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు సిబ్బంది పాల్గొన్నారు.

లూథరన్ చర్చిలో ఘనంగా క్యాంప్‌ఫైర్


క్రిస్మస్ క్యారల్స్ క్యాంప్‌ఫైర్‌లో ప్రసంగిస్తున్న ఫీనెహాస్

పెంటపాడు: గూడెం టౌన్ ఎ. క్లాస్ ప్యారిష్ సెంటినరీ లూథరన్ చర్చిలో ఆదివారం రాత్రి క్రిస్మస్ క్యారల్స్ ముగింపు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో ఘనంగా క్యాంప్‌ఫైర్ నిర్వహించారు. గురు మండల అధ్యక్షుడు డీఎల్ ఫీనెహాస్, సహాయ అధ్యక్షుడు రత్నాకర్, పాలవర్గ అధ్యక్షుడు భాస్కరరావు, సంఘ సభ్యులు కలిసి పలు అంశాలపై చర్చించారు.

హైందవ శంఖారావంలో 'సేవ్ తణుకు' నినాదాలు

తణుకు అర్బన్: విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం సభకు తణుకు నుంచి వెళ్లిన హైందవ సంఘ నాయకులు తణుకులో పశువధ తొలగించాలి, సేవ్ తణుకు నినాదాలతో హోరెత్తించారు. ఆదివారం తణుకు నుంచి హైందవ సంఘ ప్రతినిధులు ప్రత్యేక బస్సుల్లో సభకు తరలివెళ్లారు. అయితే బస్సులో కూర్చున్నది మొదలు తణుకులో పశువధ శాలను తక్షణమే తొలగించాలని, మాకొద్దు.. మాకొద్దు పశువధ శాల మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. అంతేకాకుండా హైందవ శంఖారావం నిర్వహిస్తున్న సభా ప్రాంతం వద్ద సైతం తణుకు మండలం తేతలిలో లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అక్రమంగా పశువధ శాల ద్వారా నిర్వహిస్తున్న రక్తపాతానికి వ్యతిరేకంగా గొంతెత్తారు.


విజయవాడ హైందవ శంఖారావం సభ ప్రాంతంలో సేవ్ తణుకు అని నినదిస్తున్న తణుకు వాసులు

పెద్ద సంఖ్యలో తరలిన హిందువులు

అత్తిలి: విజయవాడలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావం సభకు అత్తిలి మండలం నుంచి పెద్ద సంఖ్యలో హిందువులు తరలివెళ్లారు. అత్తిలి మండలంలోని పలు గ్రామాల నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో విశ్వహిందూ పరిషత్ నాయకులు, హిందువులు వెళ్లారు.

వైభవంగా అమ్మవారి రథోత్సవం


పూజల్లో పాల్గొన్న వడ్డి రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూటౌన్‌లోని సీతారాంపేట, కొబ్బరితోటలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మ అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా యువఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు రాజా త్రినాథ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అమ్మవారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. చిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, మేళ తాళాలు, బుట్టబొమ్మలు, సన్నాయి బ్యాండ్ మేళాలు, తీన్‌మార్ డప్పులు కోలాట నృత్యాలు, శక్తి వేషాలతో ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ శేషులత, గుండుమోగుల బలుసులు, నల్లమల్లి అంజిరెడ్డి, ఎంపీటీసీలు మార్లపూడి సుబ్బారావు, కె.జాషువా రాజు, శేఖర్, యువఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

30 మందికి వైద్యపరీక్షలు


ముస్లీం షాదీఖానాలో గుండె వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: పెంటపాడు ముస్లీం షాదీఖానాలో వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సభ్యులు బర్ల జయరాంబాబు ఆధ్వర్యంలో గుండె వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ వైవీరావు గుండె ఆసుపత్రికి చెందిన వైద్యులు రోగులకు 2డి ఈకో పరీక్షలు, స్కానింగ్ వైద్యపరీక్షలు జరిపారు. ఈ శిబిరంలో 30 మందికి వైద్య సేవలందించారు. ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు ఈ శిబిరం నిర్వహించినట్లు బర్ల జయరాంబాబు తెలిపారు. వార్డు సభ్యులు రెడ్డి శ్రీను, ఉండ్రాజవరపు రాజు, బండారు రాంబాబు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు దుర్మార్గం

అత్తిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడిన తరువాత అనేక చోట్ల దళిత వర్గాలు అణచివేతే లక్ష్యంగా భౌతిక, సామాజిక దాడులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు ఆదివారం ప్రకటనలో ఆరోపించారు. దళితులపై కర్కశంగా జరుగుతున్న దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ప్రభుత్వ పెద్దలు ప్రజా స్వామ్యంలో ఇటువంటి దుర్మార్గాలకు తావులేకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టి, దాడులకు తెగబడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. చిత్తూరు జిల్లాలో దళితులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్‌లో ఇటువంటి దాడులు పునరావృతంకాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

ఎఫ్‌సీఐ కాలనీలో ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల వద్ద నిర్వాహకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంక్రాంతి పండగ సందర్భంగా స్థానిక ఎఫ్‌సీఐ కాలనీ రోడ్డు నెంబర్ 5లో ఎఫ్‌సీఐ కాలనీ రెసిడెన్షియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. అలాగే చిన్నారులకు ఆట పాటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

భీమవరం: వాసవీ క్లబ్ సమాజానికి చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ దర్బి శ్రీనివాసరావు గుప్తా అన్నారు. భీమవరం కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం వాసవీ క్లబ్ భీమవ రం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సృజనాత్మకత, సానుకూలతలను ఉపయో గించుకుంటే ఉన్నత స్థానానికి చేరే అవకాశముందన్నారు. అనంతరం వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా తాళ్లూరి వెంకట త్రివిక్రమరావు, నేరెళ్ల వెంకట కోటేశ్వరరావు, కోశాధికారిగా చక్కా వెంకట కేశవరావు మిగిలిన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. డిస్ట్రిక్ గవర్నర్ సీహెచ్ఎన్వీ ప్రసాద్, జిల్లా కేబినెట్ సెక్రటరీ అనంతపల్లి చలపతిరావు, చల్లగండ్ల వెంకటేశ్వరరావు, కేదారిశెట్టి రవికుమార్, కనగర్ల విజయరామకృష్ణ, కేబీ పాపారావు, రాచపూడి మానస, చక్కా శ్రీనివాస్, పరుచూరి చిన నాగేశ్వరరావు, ఎస్‌జే రవిప్రసాద్, నూలి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు పుసారపు గుప్తా పాల్గొన్నారు.

కొల్లేరు ఎకో-సెన్సిటివ్ సదస్సు వాయిదా

ఆకివీడు: కొల్లేరు సరస్సు అభయారణ్యం చుట్టు ప్రక్కల ఎకో-సెన్సిటివ్ జోన్ ఖరారుపై నిర్వహించ తలపెట్టిన సదస్సు వాయిదా పడినట్లు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ నెల ఆరో తేదీన స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద సదస్సు నిర్వహించేందుకు సన్నాహాలు చేయగా నియోజకవర్గంలో మంత్రి లోకేష్ పర్యటనతో వాయిదావేసినట్లు చెప్పారు.

హైందవ శంఖారావానికి తరలిన నేతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేసరపల్లిలో నిర్వహించిన హైందవ శంఖారావానికి ఆదివారం పట్టణం నుంచి బీజేపీ నాయకులు ప్రైవేట్ బస్సులలో, వివిధ కారులలో పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, నరిశే సోమేశ్వరరావు, అయినం బాలకృష్ణ, జేకే ఆనంద్, రామగాని సత్యనారాయణ, కొండేపాటి వెంకటేశ్వరరావు, గ్రంధి ప్రసాద్, మానేపల్లి శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అనేక మంది హిందువులు తరలి వెళ్లారు.

17న గణపతి సచ్చిదానంద స్వామీజీ రాక


గణపతి సచ్చిదానంద

ఆకివీడు: మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ ఈ నెల 17వ తేదీన ఆకివీడు రానున్నారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం సదస్సుకు హాజరయ్యారు. అక్కడి నుంచి గుడివాడ రాత్రికి చేరుకున్నారు. అక్కడి నుంచి మచిలీపట్నం, మంగినపూడి ప్రాంతాలకు వెళ్లనున్నారు. 13వ తేదీన కైకలూరు, 14, 15 తేదీల్లో ఏలూరు దత్త క్షేత్రానికి, 16న భీమవరం, ఆకివీడుకు 17, 18 తేదీల్లో దత్త క్షేత్రంలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారు. సత్సంగ సభ నిర్వహిస్తారని దత్త క్షేత్ర ప్రతినిధులు తెలిపారు.

యోగాతో అనారోగ్యానికి చెక్

- ఆయన పిలుపుతో ఆరోగ్యం మెరుగు
- నాలుగు దశాబ్దాలుగా యోగాలో తర్ఫీదు
- లక్ష మందికి శిక్షణ.. దీర్ఘకాల వ్యాధులకు చెక్
- యోగా గురువు కందుల సత్యనారాయణ

ఆకివీడు: అప్పుడు సమయం తెల్లవారు జాము నాలుగు గంటలు, సెల్‌ఫోన్ రింగ్ శబ్దం. ఆ సమయంలో ఫోన్ కాల్ వచ్చిందంటే ఆయనదే. పనిగట్టుకుని 50 మందికి ఫోన్ చేసి, నిద్ర లేపి, మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే రండి. యోగా కేంద్రానికి అంటూ యోగా గురువు కందుల సత్యనారాయణ పిలుపు. 19వ శతాబ్దం చివరిలోనే ఆయన యోగాసనాలపై ఆసక్తితో పలువురి తెల్లవారు జామున పలువురి ఇళ్లకు నడిచి వెళ్లి నిద్ర లేపి యోగాకు రమ్మని పిలిచేవారు. ఆ తరువాతి రోజుల్లో సైకిల్‌పైనా, ఆ తరువాత మోటారు సైకిల్‌పైనా, ఫోన్ల ద్వారా, గత రెండు దశాబ్దాల కాలం నుంచి సెల్‌ఫోన్ల ద్వారా పిలుస్తున్నారు. ఆ ఫోన్ కాల్ వచ్చిందే తడవుగా, పిలిచిందే తడవుగా నిద్ర కళ్లను తడుచుకుంటూ మొఖం కడుక్కుని, కాస్తంత మంచినీళ్ల త్రాగి, మరికొన్ని చేత పట్టుకుని ఆకివీడులోని పతంజలి యోగారోగ్య కేంద్రానికి బయలుదేరుతారు. 50 కిలో మీటర్ల దూరం నుంచి చుట్టు ఐదు గంటల కల్లా యోగా కేంద్రానికి చేరుతారు. యోగాసనాలతో గంట సేపు గడిపి సమయపాలనతో ఆరు గంటల కల్లా ఎవరి ఇంటికి వారు తిరుగు ముఖం పడతారు. ఇలా 41 ఏళ్లగా ఆయన యోగాసనాలు చేస్తూ, పలువురితో చేయిస్తూ, ఎంతో మందిని యోగా గురువులుగా మార్చారు. స్థానిక పతంజలి యోగారోగ్య కేంద్రంలో ప్రతి రోజూ సుమారు 45 మందికి పైగా యోగాలో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికీ ఆయన కనుసన్నల్లో లక్ష మందికి పైగా యోగాసనాలు నేర్చుకుని, ప్రతి రోజూ చేస్తూ వారి ఆరోగ్యాన్ని నియంత్రించుకుంటున్నారు. 1984 నుంచి ఆయన యోగాసనాలు కొనసాగిస్తుండటం గమనార్హం.

ప్రముఖులకూ ఆయనే గురువు

పలు రంగాల్లో ప్రముఖులైన వారికి ఆయనే గురువు. మహానేత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి యోగాలో శిక్షణ ఇచ్చారు. హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, తిరుపతి, బెంగుళూరు వంటి పలు పట్టణాల్లో ఆయన యోగాసనాలు చేయించారు. పేద, ధనిక బేధం లేకుండా అందరి ఆరోగ్యం బాగుండాలి అందులో నేనుండాలి అంటూ ఆయన యోగాసనాలు చేయిస్తున్నారు. కందుల చేయి పండిందంటే ఆ వ్యక్తి ఆరోగ్యం కంద గడ్డలా ఉన్నట్లేనని పలువురు వ్యాఖ్యానిస్తుంటారు.


పతంజలి యోగారోగ్య కేంద్రంలో యోగా శిక్షణ పొందుతున్న ప్రముఖులు


ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావుతో సర్పాసనం వేయిస్తున్న యోగా గురువు కందుల సత్యనారాయణ


సూత్రనేతి ద్వారా ప్రక్షాళన చేస్తున్న దృశ్యం

ఒళ్లు నొప్పులకు ఉపశమనం



"ఇటీవల విష జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడి, జ్వరం నుంచి కోలుకున్నప్పటికీ ఒళ్లు నొప్పులు, ముఖం రంగు మారడం, కాళ్లు, చేతుల వాపులు, నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి వారికి మూడు, నాలుగు నెలల వరకూ నొప్పులు తగ్గకపోవడంతో యోగాసనాలతో వారు ఉపసమనం పొందుతున్నారు. అంతేకాకుండా మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం లభిస్తుంది. ఎంతో మందికి యోగా నేర్పించాను. మంచి ఫలితాలు వస్తున్నాయి.

– కందుల సత్యనారాయణ, యోగా గురువు, ఆకివీడు

నిత్యం చేయిస్తున్న యోగాసనాలివే

- ప్రార్థన తరువాత చేతులూ, కాళ్లకు వ్యాయామం
- సూర్య నమస్కారాలు
- మధుమేహం నియంత్రణకు నౌకాసనం
- ఉత్తాన పాదాసన్
- ధనురాసన్,
- ఒళ్లు నొప్పులకు సర్పాసనం, సరళ భుజంగాసనం
- గజకర్ణ, జలనేతి, సూత్రనేతి
- ప్రాణాయామం
- తెలివి తేటలకు భ్రమరీ ప్రాణాయామం
- జ్ఞాపక శక్తికి కమల భంగిమ (పద్మాసనం)

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక 1వ వార్డులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్ బొలి శెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చాపల రమేష్, యంత్రపాటి రాజు, సింగం సుబ్బారావు, కొల్లి నానిబాబు, రాజాల జగపతి, జావే దానయ్య, మరపట్ల జాన్, సీఓఎం చర్చి యూత్, జై భీమ్ యూత్ తదితరులు పాల్గొన్నారు.